ఉద్యాన పంటల సాగుపై సదస్సు

ప్రజాశక్తి - కడప అర్బన్

గ్రామ ఉద్యాన సహాయకులకు ఉద్యాన పంటలు, స్వర్ణాంధ్రప్రదేశ్ –2047 విజన్ ప్లాన్ పై అవగాహన సదస్సు కలెక్టరేట్‌లోని జెడిఎ సమావేశ మందిరంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. సదస్సుకు కెవికె ఊటుకూరు శాస్త్రవేత్త మానస, జిల్లా ఉద్యాన అధికారి సుభాషిని, ఎపిఎంఐపి పీడీ వెంకటేశ్వర్ రెడ్డి, ఉద్యాన అధికారులు, డిజిటల్ గ్రీన్ సిబ్బంది వెంకట గౌడ్, సహాయకులు ప్రవీణ్ హాజరయ్యారు. డిజిటల్ గ్రీన్ వారు పసుపు, ఎండుమిర్చి క్వాలిటీని ఎలా పరీక్ష చేయాలో డిజిటల్ ఎక్విప్‌మెంట్ ద్వారా వివరించారు. పీడీ డ్రిప్ పరికరాలపై గ్రామ ఉద్యాన సహాయకులకు అవగాహన కల్పించి, వాటి ఉపయోగం గురించి తెలిపారు. డిటిహెచ్ సుభాషిణి మాట్లాడుతూ ఉద్యాన పథకాలు అమలు చేసే విధానాన్ని ప్రతి రైతుకు చేరాలని, ఉద్యాన పంటలపై అవగాహన పెంచుకోవాలని పేర్కొన్నారు. విజన్ ప్లాన్ కొరకు ఉద్యాన పంటలలో గ్రోత్రేట్ ఏ విధంగా పెంచాలో తెలిపారు. కెవికె శాస్త్రవేత్త పూతలో తీసుకోవలసిన జాగ్రత్తలపై, మామిడి పూత విచుకున్నపటినుంచి తేలికపాటి తడులతో ప్రారంభించి నీటిని ఇవ్వాలని చెప్పారు.

ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించండి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-పీలేరు

ప్రజలకు మంచి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన వాటికి నాణ్యమైన పరిష్కార మార్గాలు చూపాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం పీలేరు తహశీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పిజిఆర్ఎస్, రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీల గురించి గ్రామాల వారీగా రెవెన్యూ అధికారులు, సిబ్బందితో ప్రత్యేకంగా సమీక్షించారు. పిజిఆర్ఎస్‌లో ఇంకను 80, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన వాటిలో 56 దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయన్నారు. వీటిని ఒక వారంలోగా పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. వీలైనంత త్వరగా ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిష్కరించి.. కార్యాలయాలు చుట్టూ తిరగకుండా పరిష్కార మార్గాలు చూపాలన్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను పరిష్కరించడంలో వెనుకబడిన గ్రామాల విఆర్ఒలను కారణాలు అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెవిన్యూ సదస్సులను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవడం మన అందరి బాధ్యతన్నారు. ఈ సదస్సులో వచ్చిన మొత్తం అర్జీలను నాణ్యతగా పరిష్కరించడమే అధికారుల లక్ష్యం కావాలన్నారు. వచ్చిన అర్జీలలో మ్యూటేషన్స్, అసైన్‌మెంట్, ఆర్ఒఆర్, భూసేకరణ, దారి సమస్యలు, ఫౌతి కేసులు, అన్నదమ్ముల భాగ పరిష్కారాలు, డిస్ప్యూట్స్, సివిల్ కేసులు తదితరాలను సమీక్షించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. మండలంలో ప్రభుత్వ భూములను ఎక్కడైనా ఆక్రమణలు జరిగినట్లు గుర్తిస్తే వెంటనే తొలగించి స్వాధీనం చేసుకోవాలని సూచించారు. తప్పనిసరిగా ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాలన్నారు. రెవెన్యూ, సర్వే, పోలీసు శాఖలతో బృందాలను ఏర్పాటు చేసుకొని ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను వెంటనే స్వాధీనం విధంగా చర్యలు తీసుకోవాలని ఇందులో ఎవరి ఒత్తిడికి లోనుకాకుండా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌డిసి రమాదేవి, తహశీల్దార్ భీమేశ్వర రావు, ఎంపిడిఒ, ఆర్ఐ, మండల సర్వేయర్, విఆర్ఒలు, విఆర్ఎలు పాల్గొన్నారు.

మత సామరస్యం అందరి బాధ్యత

- ర్యాలీలో ప్రజా సంఘాల నేతలు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

మనిషికి మతం వ్యక్తిగతమని అన్ని మతాలకన్నా మానవత్వం గొప్పదని, మతసామరస్యంతో మెలగడం ప్రతి ఒక్కరి బాధ్యతని ప్రజాసంఘాల నేతలు పేర్కొన్నారు. గురువారం స్థానిక అంబేద్కర్ చిత్రపటం దగ్గర శాంతి సంఘీభావం తెలుపుతూ నినదించారు. ఈ సందర్భంగా దండోరా జాతీయ నాయకులు ఎస్.రామాంజనేయులు, వడ్డెర విద్యా వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మారుతీ, హమానత్ సేవా సొసైటీ నాయకులు అతావుల్లా, సహారా సొసైటీ నాయకులు ఆప్తాబ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, జనసేన నాయకులు నాగేంద్ర, పఠాన్, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.వి.రమణ, రైతు సంఘం నాయకులు బసిరెడ్డి, సిఐటియు నాయకులు సాయి, రెడ్డెయ్య మాట్లాడుతూ అనేక కులమతాలకు నిలయమైన భారత్ దేశం భిన్నత్వంలో ఏకత్వం గల గొప్ప దేశమని ప్రపంచదేశాలు కొనియాడుతున్నారంటే కారణం భారతీయుల డిఎన్ఎలోనే సంస్కృతి, సత్ప్రవర్తన వారి సంప్రదాయాలు, స్వాతంత్ర పోరాటం భారతీయుల ఐక్యత కు నిదర్శనం అన్నారు. శాస్త్ర సాంకేతిక రంగం వేగంగా దూసుకెలుతూ అభివృద్ధిలో ఇతర దేశాలతో పోటీపడుతుంటే కొందరి చర్యల వలన దేశ ప్రగతికి నష్టమన్నారు. రాయచోటిలో 4 నెలలు కాకమునుపే రెండు సార్లు దుర్ఘటనలు జరగడం క్షమించరానిదన్నారు.

శాంతి ర్యాలీ చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

రాయచోటి లో 16 వ శతాబ్దం నుండి హిందూ, ముస్లిం లకు గొడవలు లేవని పేర్కొన్నారు. ప్రస్తుతం పండగలు పోలీసుల పహారాలో జరుపుకునే దుస్థితికి మతోన్మాదులే కారణమని తెలిపారు. అటువంటి వారిని శాశ్వతంగా జైల్లో ఉంచాలని డిమాండ్ చేశారు. రాయచోటిలో జరిగిన ఘటనలో పోలీసు చర్యలు భేష్ అని, భవిష్యత్‌లో పరమత సహనం పేరుతో మతసామరస్యానికి ప్రజాసంఘాలు కృషి చేస్తాయని తెలిపారు.

కలర్ గ్రానైట్ తవ్వకాలపై ప్రజాభిప్రాయ సేకరణ

- పచ్చనిపల్లెల్ని నాశనం చేస్తున్నారన్న గ్రామస్తులు

గ్రామస్తుల అభిప్రాయాలు నోట్ చేసుకుంటున్న సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలోని కోటవారిపల్లె కలర్ గ్రానైట్ అనుమతికి గురువారం తహశీల్దారు ధనంజయులు ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సమావేశానికి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. పల్లెలకు ముప్పు రానియ్యమని, పర్యావరణాన్ని కాపాడుతామంటూనే పచ్చని పల్లెల్ని నాశనం చేస్తున్నారని గ్రామస్తులు వాపోయారు. పర్యావరణం పరిరక్షణ పేరుతో స్వంచ్ఛంద సంస్థలు, అధికారులు కుమ్మక్కై నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇబ్బడిముబ్బడిగా వెలసిన క్వారీల వల్ల కోటవారిపల్లె గ్రామంలో రైతులు తీవ్రంగా నష్టపోయామని సబ్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. చిన్న, సన్న కారు రైతులు, పాడి రైతులు సంపదను కోల్పోవాల్సిన దుస్థితి నెలకొందని పేరొన్నారు. గతంలో క్వారీ అనుమతులు పొందిన వారంతా ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. క్వారీ లీజుదారులు అనుమతి పొందేందుకు నిర్దేశించిన సూత్రాలను పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ పరిరక్షణ మండలి బోర్డు సభ్యులకు డబ్బులిచ్చి తమకు అనుకూలంగా మార్చుకుని అభిప్రాయాలను అనుకూలంగా చెప్పించుకుంటున్నారని ఆరోపించారు. గతంలో క్వారీల నిర్వాహకుల ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్న నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ గ్రామస్తులకు తెలియజేశారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు కలర్ గ్రానైట్ తవ్వకాలకు అనుమతి ఇవ్వడమా లేదా అన్నది ప్రతిపాదిస్తామన్నారు. సమావేశంలో కోటవారిపల్లె గ్రామస్తులు, రైతులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

'పది'లో మంచి ఫలితాలు సాధించాలి :'చిత్తా'

ఎపి రెసిడెన్షియల్ స్కూల్లో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న చైర్మన్ చిత్తా

ప్రజాశక్తి-పీలేరు

బడికి వచ్చే పిల్లలను, అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులను కన్నబిడ్డల్లా చూసుకోవాలని ఆహార కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన పీలేరు పట్టణంలో అంగన్వాడీ కేంద్రాలు, గురుకుల పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో సంక్షేమ వసతి గృహాలకు, గురుకుల పాఠశాలలకు, అంగన్వాడీ కేంద్రాల్లోని విద్యార్థుల ఆకలి తీర్చడం కోసం ప్రభుత్వం సన్న బియ్యం సరఫరా చేయనున్నట్లు చెప్పారు. స్థానిక ఎల్‌బిఎస్ రోడ్డులోని 8వ నెంబరు చౌక దుకాణాన్ని తనిఖీ చేసి డీలరు కుసుమకుమారితో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు ఇస్తున్న ఉచిత బియ్యం వినియోగదారులకు సక్రమంగా అందజేయాలని ఆదేశించారు. ఆ చౌక దుకాణంలో తూనికలు సక్రమంగా ఉన్నాయా లేదా అని, పప్పు, చక్కెరకు అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారా అని లబ్ధిదారులతో వాకబు చేశారు. చౌకదుకాణం నుంచి అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న నిత్యావసర సరుకులు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అక్కడికి సమీపంలోని పాలాలవారి వీధిలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసి చరవాణి ద్వారా గర్భిణులు, చిన్నపిల్లల తల్లులతో మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం సక్రమంగా సరఫరా అవుతోందా లేదా అని ఆరా తీశారు. మెనూ ప్రకారం అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు పౌష్టిక ఆహారాన్ని అందిస్తున్నారా లేదా అని కూడా విచారించారు. జ్యోతిరావు పూలే గురుకుల బాలికల పాఠశాల, అంబేద్కర్ సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల విద్యాలయం, ఎపి గురుకుల బాలికల పాఠశాలలను కూడా ఆయన తనిఖీ చేశారు. ఎపి గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థులకు భోజనాలు వడ్డించి, విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. తర్వాత పాఠశాల సిబ్బందితో మాట్లాడుతూ ప్రతిరోజు భోజనం ఇలానే ఉండాలని విద్యార్థులను కన్న బిడ్డల్లా చూడాలని, 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా చేయాలని సూచించారు. జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలలో వంట సామాగ్రి తనిఖీ చేస్తుండగా ఓ అట్ట పెట్టెలో కాలం చెల్లిన గోధుమ రవ్వ, అప్పలాలు గుర్తించి, మరోసారి ఇలా ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కేర్ టేకర్‌ను హెచ్చరించారు. కమిషన్ చైర్మన్ విద్యార్థులతో మాట్లాడుతూ పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. గత ఏడాది కన్నా ఈ సంవత్సరం పదిలో అధిక మార్కులు సాధించన విద్యార్తులకు తన తరపున చేతి గడియారాన్ని బహుమతి ఇవ్వాలని చెబుతూ ప్రిన్సిపల్ రాధా రాణి చేత రూ.2 వేలు నగదును అందజేశారు. కామాటంపల్లి అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి అక్కడ పిల్లలకు నేర్పుతున్న బోధనా పద్ధతులను చూసి అంగన్వాడీ కార్యకర్త రోజా రాణిని అభినందిస్తూ తనిఖీ పుస్తంలో రాసి సంతకం చేశారు. అయ్యప్పరెడ్డి కాలనీలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతూ విద్యా శాఖ మంత్రి లోకేష్ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందివ్వడం కోసం కృషి చేస్తున్నారని, వాటిని అర్థం చేసుకుని ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో డిఇఒ సుబ్రహ్మణ్యం, జిల్లా బిసి సంక్షేమ శాఖఅధికారి సురేష్ బాబు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి జయ ప్రకాష్, డిఎస్ఒ రఘురామన్, ఐసిడిఎస్ పీడీ రమాదేవి, సిడిఎఒ రాజమ్మ, తహశీల్దారు భీమేశ్వరరావు, ఎంఇఒ లోకేశ్వర్ రెడ్డి, గురుకుల పాఠశాల కన్వీనర్ బ్రహ్మాజీ, గురుకుల పాఠశాలల ప్రిన్సిపళ్లు రాధారాణి, బేబీ కరుణ, లోకేశ్వరి పాల్గొన్నారు.

హాస్టల్ వార్డెన్‌కు షోకాజ్ నోటీసు జారీ

కలికిరి: మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందించని వార్డెన్‌కు ఆహార కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్‌ప్రతాప్‌రెడ్డి షోకాజ్ నోటీసులు అందించారు. గురువారం స్థానిక ఎస్సీ హాస్టల్లో ఆయన ఉదయం ఎనిమిది గంటలకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, వంట గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా హాస్టల్ విద్యార్థులను మెనూ సక్రమంగా ఇస్తున్నారా లేదా అని ఆరా తీశారు. విద్యార్థులు హాస్టల్ వార్ధన్ సక్రమంగా ఆహారం ఇవ్వడం లేదని, నెలలో మూడు సార్లు చికెన్ పెట్టవలసి ఉండగా రెండుసార్లు పెడుతున్నారని, అది తక్కువ మోతాదులో పెడుతున్నారని, పాలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారు. ఆగ్రహించిన ఆయన హాస్టల్ వార్డెన్ వి.రవీంద్రపై మండిపడ్డారు. టిడికి ఫోన్ చేసి రవీంద్రకి షోకాజ్ నోటీసులు ఇప్పించారు. కార్యక్రమంలో ఎంఇఒలు కరిముల్లా, నాగార్జునరెడ్డి, ఐసిడిఎస్ సిడిపిఒ భారతి, సిఆర్‌పి సురేష్ పాల్గొన్నారు.

మహాసంప్రోక్షణ నిర్వహిస్తున్న అర్చకులు

శాస్త్రోక్తంగా మహాసంప్రోక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి ఆలయంలో మహాసంప్రోక్షణ, కుంభాభిషేకం కార్యక్రమాలు గురువారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 15న ఉదయం 10.15 నుండి 11:30 గంటల వరకు వృషభ లగ్నంలో మహాసంప్రోక్షణతో ఈ కార్యక్రమం ముగుస్తుంది. టిటిడి ఆగమ సలహాదారులు, ప్రధాన కంకణబట్టర్ రాజేష్‌స్వామి ఆధ్వర్యంలో గురువారం ఉదయం 7.30 గంటలకు భగవత్పుణ్యాహం, అగ్ని మథనం, యాగశాలలో వైదిక కార్యక్రమాలు, మహాకుంభ, ఉపకుంభ, చక్రబ్జ మండల, పరివార కుంభారాధనలు, ప్రధాన మూర్తి హోమాలు, శ్రీమద్రామాయణ హవన ప్రారంభం, మన్మోహన శాంతి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటలకు చతుస్థానార్చనం, సహస్ర కళశాదివాసం, వేదాది పారాయణం, మూర్తి హోమం, పరివార హోమాలు, పూర్ణాహుతి సాత్తుమొర నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఇఒలు నటేష్ బాబు, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఇతర అధికారులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

వైవీయూ విసి ప్రకాశ్‌బాబు బదిలీ

ప్రజాశక్తి - కడప అర్బన్

వైవీయూ విసిగా ఫిబ్రవరి 24న బాధ్యతలు స్వీకరించిన ప్రకాష్ బాబు బదిలీ అయ్యారు. విసి ప్రతిభను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పుదుచ్చేరి సెంట్రల్ వర్సిటీ విసిగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఐదేళ్ల పుదుచ్చేరి విసిగా ప్రకాష్ బాబు కొనసాగుతారు. ఇటీవల విసిల నియామకంలో భాగంగా ఆయన వైవీయూకు వచ్చారు. ఎంతో ప్రతిభ పాఠవాలు ఉన్న విసి పట్టుమని పది రోజుల్లో బదిలీ కావడంపై వైవీయూ వర్గాలు విస్మయం చెందాయి.

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-మదనపల్లె

ఆటో డ్రైవర్లకు పిఎఫ్, ఇఎస్ఐ పెన్షన్లతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఎఐటియుసి కార్యాలయంలో ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం రెడ్డప్ప అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణ ప్రాంతాలకు ప్రయాణికులను గమ్యస్థానానికి చేరవేయడం, రైతుల పంటలను మార్కెట్లో చేర్చడంలో కీలకపాత్ర పోసిస్తూ ప్రభుత్వానికి కోట్లలో పన్నులు చెల్లిస్తున్నా భారీగా చలానాలు పెంచుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 21, 31 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డీజిల్ పెట్రోల్, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ 30 శాతానికి తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆటోల మీద ఉన్న పోలీస్ ఈ చలనాలు రద్దు చేయాలని కోరారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆటో స్టాండ్లు, పార్కింగ్ స్థలాలు కేటాయించాలని కోరారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తే ఆ సందర్భంగా ఆదాయం కోల్పోయే ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయం చూపించాలని ప్రభుత్వాన్ని కోరారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తారని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 894 గెజిట్ నోటిఫికేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి సలీం బాషా, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వర్రీ సురేష్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు వేణు గోపాల్ రెడ్డి, ఎఐటియుసిమదనపల్లి నియోజకవర్గ కార్యదర్శి ముబారక్, అధ్యక్షుడు రెడ్డెప్ప, మదనపల్లి పట్టణ కార్యదర్శి తిరుమల ఆటో డ్రైవర్స్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు నాగేశ్వరరావు,వెంకటేష్, రమణ, మస్తాన్, శివ శంకర, గంగులప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులుగా ప్రశాంత్

నియమకపత్రంలో ప్రశాంత్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులుగా ఎల్లంపల్లి ప్రశాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం మాజీ రాజ్యసభ సభ్యులు టి.జి.వెంకటేష్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ ఇంత పెద్ద బాధ్యతను అప్పగించిన ఆర్యవైశ్య మహాసభ గౌరవ అధ్యక్షులు టి.జి.వెంకటేష్, ఇల్లూరు లక్ష్మయ్యకు, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు చిన్న రామసత్యనారాయణ, ముప్వల నరసింహులుశెట్టి, పలస వేణుగోపాల్, ఓంప్రకాష్‌లకు ధన్యవాదాలు తెలియజేశారు. నాపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతను సమర్ధవంతంగా నిర్వహిస్తానని, అందరికీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలియజేశారు. జిల్లాలో ఆర్యవైశ్య సంఘం బలోపేతానికి, ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఆర్యవైశ్యుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన ఎల్లంపల్లి ప్రశాంత్ కు పలువురు ఆర్యవైశ్య కుల ప్రముఖులు, ఆర్యవైశ్య నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీసాయి కళాశాల విద్యార్థుల ప్రభంజనం

ప్రజా శక్తి రాయచోటి

శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు జెఎన్‌టియు యూనివర్సిటీ విడుదల చేసిన మేనేజ్‌మెంట్ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ యూనివర్సిటీ ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనపరిచారని విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్ రెడ్డి తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేనేజ్మెంట్ విభాగంలో బి.అమృత 85.5 శాతంతో మొదటి ర్యాంకు, ఎస్ షాహిన్, ఎస్.రుమానా, ఎస్. కౌసర్, ఎస్.నందిని 83.37 శాతంతో రెండవ ర్యాంకు ఎస్.అతిఫా బేగం 83.25 శాతంతో మూడవ ర్యాంకు సాధించి యూనివర్సిటీ స్థాయిలో అగ్రగామిగా నిలిచారని తెలియజేశారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను, ఫలితాల సాధనలో భాగమైన అధ్యాపకులను అభినందించారు. ప్రతి ఒక్కరికి ఉద్యోగ ఉపాధి భరోసా ఇవ్వడానికి మౌలిక వసతులు కల్పిస్తున్నామని వివరించారు. వీరిని ఆదర్శంగా తీసుకుని మిగిలిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని దిశానిర్దేశం చేశారు. కళాశాలలో అమలుపరుస్తున్న అకాడమిక్, కమ్యూనికేషన్ స్కిల్స్, ప్లేస్మెంట్ ట్రైనింగ్, స్పోర్ట్స్ అండ్ గేమ్స్, వర్క్ షాప్స్ సెమినార్స్ వంటి అంశాలను ప్రామాణికంగా చేసుకొని యుజిసి సంస్థ నుండి నాక్ బి ప్లస్ గ్రేడ్ గుర్తింపు రావడం గర్వకారణమని చెప్పారు. యుజిసి అటానమస్ ప్రక్రియను వేగవంతం చేశామని, తద్వారా ఆధునిక శాస్త్ర సాంకేతిక అంశాలు విద్యార్థులకు అందుబాటులోకి వస్తాయని అభిప్రాయపడ్డారు. ప్రతి విద్యార్థీ లక్ష్యాన్ని నిర్దేశించుకుని అంకితభావంతో కృషి చేయాలని పేర్కొన్నారు. క్రమశిక్షణతో ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థానాన్ని అధిరోహించాలని సూచించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.బాలాజీ, మేనేజ్‌మెంట్ విభాగాధిపతి కొత్తపల్లి ఇంతియాజ్, అధ్యాపకులు అభినందించారు.

ప్రతిభ చూపిన విద్యార్థులతో యాజమాన్యం

ఎంప్లాయిస్ యూనియన్ నాయకులతో చమర్తి

ఆర్‌టిసి సమస్యల పరిష్కారానికి కృషి :'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట ఆర్టీసీ డిపో లోని సమస్యలను ప్రభుత్వ పరంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని టిడిపి పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు తెలిపారు. రాజంపేట వేదికగా జరగనున్న ఆర్టీసీ మహిళా దినోత్సవానికి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు జగన్ మోహన్‌రాజును ఆహ్వానించారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జగన్ మోహన్‌రాజు ఆర్టీసీ సమస్యలపై సానుకూలంగా స్పందిస్తూ ప్రభుత్వ పరంగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ నాయకులు రమణ, జిల్లా కార్యదర్శి శేఖర్, సీనియర్ నాయకులు, ఎపి జెఎసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాలమ్మ, డిపో గౌరవ అధ్యక్షులు మథ్యూస్, డిపో అధ్యక్షులు సుబ్బయ్య, బాలాజీ, వల్లి, రంతుల్లా, గ్యారేజ్ కార్యదర్శి వెంకటసుబ్బయ్య, చలపతి పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని బహిష్కరించండి

ప్రజాశక్తి - కడప : కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన వక్ఫ్ సవరణల చట్టం– 2024 వాస్తవంగా ఆస్తుల భక్షణ చట్టం అని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీఖాన్, కడప నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్, కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎం. రహమతుల్లాఖాన్ పేర్కొన్నారు. కడప నగరంలోని స్థానిక రెండో గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు గురువారం ఈ చట్టానికి వ్యతిరేకంగా కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మతవిద్వేష పాలకుడు ప్రధాని నరేంద్ర మోడీ 1995 వక్ఫ్ చట్టాన్ని రద్దుచేసి ఏకపక్షంగా కొత్త చట్టాన్ని తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. భారత రాజ్యాంగ విరుద్ధమైన ఈ చట్టాన్ని ప్రతి ఒక్కరూ బహిష్కరించాలని పిలుపునిచ్చారు. వాస్తవంగా ఈ చట్టం దేశంలోని లక్షలాది కోట్ల రూపాయల సంపద కలిగిన వక్ఫ్ ఆస్తులను భారతీయ జనతా పార్టీ, ఆర్ఎస్ఎస్ కలిసి కాజేసేందుకు కుట్ర పన్నినట్లు విమర్శించారు. పాత వక్ఫ్ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలు ఈ చట్టాన్ని మూకుమ్మడిగా బహిష్కరించాలని మరోసారి పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరికి నిరసనగా వివిధ స్థాయిల్లో ప్రజా ఉద్యమాలు, ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ప్రధానంగా రాష్ట్రంలోని రాయలసీమ జిల్లాల్లో ఎక్కువగా కోట్లాది రూపాయల విలువైన ఆస్తులు ఉన్నాయని తెలిపారు.

మాట్లాడుతున్న వడ్డెర సంఘం నాయకులు

వడ్డెర కార్పొరేషన్ మాజీ చైర్మన్‌కు ఎమ్మెల్సీ ఇవ్వాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వడ్డెర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవర్ల మురళికి ఎమ్మెల్సీ ఇవ్వాలని మదనపల్లె వడ్డెర సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మదనపల్లెలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ మాజీ చైర్మన్, రాష్ట్ర కార్యదర్శి దేవర్ల మురళికి ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వడం వల్ల వడ్డెర సామాజిక వర్గానికి న్యాయం చేకూర్చినట్లవుతుందని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బడుగు, బలహీన వర్గాలకు సముచిత ప్రాధాన్యమివ్వడం సంతోష కరమైన విషయమని మదనపల్లె వడ్డెర సంఘం నాయకులు జరిపిటి రెడ్డెప్ప, డేరంగుల శ్రీనివాసులు, ఇడగొట్టి రెడ్డిశేఖర్, తమ్మిశెట్టి రామకృష్ణ, మేకల రెడ్డిశేఖర్, గుణభూషణ్ పల్లపురెడ్డెప్ప, గుండ్లూరి రామ్మోహన్, బి.వెంకట నారాయణ, జె.నాగరాజు, సి.సిద్దప్ప, హెూటల్ శంకర, పూజారి ఆంజి, ఏ.శ్రీనివాసులు, పి.రెడ్డి శేఖర్లు ప్రకటించారు. ఎమ్మెల్యేల కోటాలో నియమించబడే ఎమ్మెల్సీ స్థానాలలో కనీసం ఒకటి వడ్డెర కులస్తులకు కేటాయించాలని కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. జనాభా గణన చేసినట్లయితే ఎవరి జనాభా ఎంతో పూర్తి వివరాలు తెలుస్తాయని, ఈ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. తరతరాలుగా ట్రైబ్స్, డినోటిఫైడ్ ట్రైబ్స్ గా వున్న వడ్డెరలను వెనుక బడిన తరగతులలోకి నెట్టబడటంతో అతి పేదరికంలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాలలో వడ్డెరలు షెడ్యూల్ కులాలు, తెగలలో ఉన్నారని తెలుగు రాష్ట్రాలలో వెనుకబడిన తరగతుల్లోకి నెట్టి వేయబడ్డారని తెలిపారు. వడ్డెరలను ఎస్సీ, ఎస్టీ, డిఎన్‌టి, ఎంబిసి ఇలా ఏ విభాగంలోనికి చేర్చినా అభ్యంతరం లేదన్నారు. తప్పక రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. వడ్డెర్లపై దాడులు, దౌర్జన్యాలు, దోపిడి సర్వసాధారణం అయిపోయినందున తమ రక్షణకు ప్రత్యేక చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కురవంక తెలుగుదేశం పార్టీ ఇంఛార్జి తమ్మిశెట్టి రామకృష్ణ, వడ్డెర సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు తగవు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కించపరిచి మాటాడితే సహించేది లేదని జనసేన రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త శ్రీనివాసరాజు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి చర్లపల్లి జైలుకు ఎక్కువ, తీహార్ జైలుకు తక్కువని తెలిపారు. పవన్ కల్యాణ్‌ను నోటికొచ్చినట్టు మాట్లాడిన జగన్‌కు మానసిక పరిస్థితి బాగోలేదన్నారు. ప్రజా నాయకుడు పవన్ కల్యాణ్‌ను విమర్శిస్తే రాబోయే రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి అందిస్తున్న ఇన్‌ఛార్జి హెచ్‌ఎం రెడ్డయ్య

'పది' విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని టిడిపి సీనియర్ నాయకులు తాటికుంట్ల శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక జడ్‌పి హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులకు గురువారం రైటింగ్ ప్యాడ్స్, పెన్సిల్స్, పెన్స్, షార్ప్‌నర్స్, స్కేళ్లు పంపిణీ చేశారు. పదిలో 63 మంది విద్యార్థులకు సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రయివేట్ పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడం జరుగుతోందని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని అన్నారు. విద్యార్థులందరూ బాగా చదివి, మంచి మార్కులు సాధించి, మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు అందరికీ కూల్ డ్రింక్స్, స్వీట్స్, మిక్సర్ బిస్కెట్లు పంపిణీ చేశారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేసిన శ్రీధర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమార్, బాబురెడ్డి, వివేకానందస్కూల్ కస్పాండెంట్ మధుసూదన్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, విఆర్‌డిఎస్ చైర్మన్ సురేంద్రరెడ్డి, మధుసూదన్ రెడ్డి, హరిబాబు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-రామాపురం

మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర హైస్కూల్‌లో ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యం శిబిరం నిర్వహిస్తున్నట్లు రాయచోటి లయన్స్ క్లబ్ క్యాంపు ఆర్గనైజర్లు ఆంజనేయరెడ్డి మిక్కినేని ప్రసాద్‌నాయుడు తెలిపారు. స్థానిక శ్రీ వెంకటేశ్వర హైస్కూల్ ఆవరణంలో తిరుపతికి చెందిన శ్రీ వెంకటేశ్వర అరవింద కంటి ఆసుపత్రి, మధురై అరవింద కంటిఆస్పత్రి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని కంటి సమస్యలున్న ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సిబ్బందితో మాట్లాడుతున్న డిఎల్‌పిఒ నాగరాజు

వినియోగంలోకి చెత్త నుంచి సంపద కేంద్రాలు : డిఎల్‌పిఒ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని ప్రతి గ్రామపంచాయతీలోనూ ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగం లోకితేవాలని డిఎల్‌పిఒ నాగరాజు కోరారు. కుక్కరాజుపల్లి, కన్నెమడుగు, తంబళ్లపల్లి కోటకొండ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు తనిఖీ చేశారు. పది రోజుల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు పూర్తిస్థాయిలో డోర్ టు డోర్ కలెక్షన్ చేసే పూర్తిస్థాయిలో కేంద్రాలు పనిచేయించవలసిందిగా కార్య దర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి దిలీప్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు అనిత, ప్రమీల, సుశీల, రామకృష్ణ పాల్గొన్నారు.

బ్రాహ్మణులకు అండగా క్రెడిట్ సొసైటీ

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలో బ్రాహ్మణులు ఆర్థికంగా ఎదగడానికి బ్రాహ్మణ కోఆపరేటివ్ సొసైటీ పూర్తిగా సహాయ సహకారాలు అందిస్తోందని సొసైటీ సిఇఒ నాగసాయి తెలిపినట్లు కడప జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ప్రసాదరావు పేర్కొన్నారు. విజయవాడ సొసైటీ ప్రధాన కార్యాలయంలో వివిధ అంశాలపై ఆయనతో మాట్లాడినట్లు ప్రసాదరావు తెలిపారు. రాష్ట్రంలో సొసైటీ మెంబర్ షిప్ ఉన్న బ్రాహ్మణులకు రూ.5 కోట్ల మేర వ్యక్తిగత స్వయం ఉపాధి రుణాలు ఇవ్వడానికి క్రెడిట్ సొసైటీ సిద్ధంగా ఉందని సిఇఒ తెలిపారన్నారు. బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ ఒక నిర్దిష్ట పద్ధతిలో పని చేస్తున్నట్లు చెప్పారు. దేశంలోనే ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీకి ఒక ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. 70వేల మందితో బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ బలంగా ఉందని, బ్రాహ్మణులు ఆర్థికంగా బలపడడానికి అనేక పథకాలు రూపొందించినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో క్రెడిట్ సొసైటీ సభ్యత్వం తీసుకొనే అవకాశం ఉందని ప్రసాదరావు వివరించారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగాలు

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటిలో గురువారం జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 7 మందికి ఉద్యోగాలు వచ్చినట్లు ప్లేస్మెంట్ కో-ఆర్డినేటర్ వినోద్‌కుమార్ తెలిపారు. బెంగళూరుకు చెందిన ఇంటెల్ కంపెనీ ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఇంజినీరింగ్ థర్డ్ ఇయర్ ఇసిఇ చదువుతున్న 7 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వీరిని ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్ అభినందించారు. ప్లేస్మెంట్ ఇంటర్వ్యూలో విద్యార్థులు ఎంపిక కావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సుందర్, ఇసిఇ బ్రాంచ్ ప్రొఫెసర్ సుధాకర్ రెడ్డి, అరుణ్ కుమార్‌రెడ్డి, మదన్ కుమార్ పాల్గొన్నారు.

అధ్యాపకుడిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

వేంపల్లి ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న ఓ విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన అధ్యాపకుడ్ని శిక్షించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యులు అభినయ్ ఒక ప్రకట నలో డిమాండ్ చేశారు. విద్యాబుద్ధులు నేర్పించాల్సిన అధ్యాపకుడు ఇలాం టి వాటికి పాల్పడటం సిగ్గుచేటన్నారు. ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని లేకుంటే ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

మహారాజశ్రీ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు : రైల్వేకోడూరు

I.A.No. 111/2025
I.A.No. 161/2024 In
O.S.No.2/2021

గుంటూరు బాల కిషోర్ ...పిటీషనరు/వాది
Vs
1.కల్వకుంట్ల గోపాల్ రెడ్డి Died, వారి వారసులు. ...రెస్పాండెంట్స్/ప్రతివాదులు

ప్రతివాది నెం.3 :
కల్వకుంట్ల కోటిరెడ్డి, S/o గోపాల్‌రెడ్డి, వయస్సు 45 సం॥లు, బాలిరెడ్డిపల్లి (గ్రా॥ మరియు పో॥), ఓబులవారిపల్లి (మం॥), అన్నమయ్య జిల్లా.

పైన పేర్కొనబడిన ప్రతివాది/ రెస్పాండెంట్ నెం.3 అయిన మీ పైన పై తెలిపిన నెంబరు గల సివిల్ దావా మరియు ఇన్‌జక్షన్ పిటిషను మహారాజశ్రీ సివిల్ జడ్జి (జూనియర్ డివిజను) కోర్టు, రైల్వేకోడూరు యందు దాఖలు చేసియున్నారు. మీకు ఏమైనా ఆక్షేపణ ఉన్న యెడల సదరు కోర్టు వారి ఎదుట 20.03.2025న ఉదయం 10.30 గంటలకు హాజరై తమరి యొక్క అభ్యర్థనను తెలుపుకొనగలరు. లేకున్నను పై నెంబరు గల సివిల్ దావా మరియు ఇన్‌జక్షన్ పిటిషన్ మీపై పరోక్షముగా రాజశ్రీ కోర్టు వారు తీర్మానించెదరని తెలియజేయడమైనది.

//కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//
ఎమ్.చిట్టిబాబు, ఎస్.నరసింహారావు
న్యాయవాదులు, రైల్వేకోడూరు. సెల్: 9885139488.

రాజశ్రీ సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్) నందలూరు కోర్టులో

O.S.No. 101/2024

మూరి వెంకటక్రిష్ణారెడ్డి, తండ్రి వెంకటరెడ్డి, 63 సం॥లు, రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవరు, ఆడపూరు గ్రా॥, నందలూరు మండలం, అన్నమయ్య జిల్లా. ...వాది
Vs
బీము స్వర్ణలత, భర్త బీము శంకర్‌రెడ్డి, గృహిణి, 40 సం॥లు, తొగురుపేట గ్రామం, రాజంపేట మండలం, అన్నమయ్య జిల్లా. ...ప్రతివాది

పై కోర్టులో వాది మీ పై ప్రోనోటు బాకీ రూ.5,14,400/-లకు గాను పై దావా దాఖలు చేసియున్నాడు. మీకేమైనా ఆక్షేపణలున్న యెడల 02.4.2025 తేదీన ఉ॥ 10.30 గం॥లకు సదరు కోర్టులో హాజరై తెలుపుకోరడమైనది. లేని యెడల పరోక్షముగా తీర్మానించబడును.

//By Order of the Court//
ఓ.వి.క్రిష్ణారెడ్డి, M.A., L.L.B.,
అడ్వకేట్,
నందలూరు.

ఈ ఏడాది మామిడి రైతులకు నష్టాలే..!

- పిందె దశలోనే రాలిపోతున్న కాయలు
- అరకొరగా వచ్చిన కాపునకు గిట్టుబాటు వస్తుందో, రాదోనన్న ఆందోళనలో రైతులు
- పంటల బీమా వర్తింప చేయాలని వేడుకోలు

మామిడి చెట్లకు పిచికారి చేస్తున్న రైతులు

ప్రజాశక్తి-వీరబల్లి

మామిడి రైతులకు వాతావరణ మార్పులతో ఈ ఏడాది కూడా నష్టాలే మిగిలేలా ఉన్నాయి. గత నాలు గేళ్లుగా వీరబల్లి, సుండుపల్లి మండలాల్లో మామిడి పంట రాక రైతన్న సతమతమౌతుంటే ఈ ఏడాది కూడా పంట కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలనే ఆందోళనలో ఉన్నారు. వీరబల్లి మండలంలో సుమారు 5వేల ఎకరాలు, సుండుపల్లి మండలంలో 6,250 ఎకరాల్లో మామిడి సాగులో ఉంది. వీరబల్లి బేనీషా రకానికి భలే గిరాకీ అని ఢిల్లీ, ముంబై, కలకత్తా ప్రాంతాల నుంచి వ్యాపారులు కొన్ని నెలల పాటు తిష్ట వేసి అక్కడి ప్రాంతాలకు తరలిస్తారని రైతులు తెలిపారు. మామిడి పంట సాగు చేయాలంటే అధిక మొత్తంలో ఖర్చు వస్తోందని చెట్లకు దుక్కి, ఎరువులు, కూలీలు కూడ ఎక్కువని అన్నారు. పెట్టుబడి ఎక్కువ ఆదాయం తక్కువ అవతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం

బంక తెగులు పట్టిన మామిడి చెట్లు

మామిడి చెట్లలో పూత ఎక్కువగా ఉన్న వేసవికి మామిడి పిందెలు రాలిపోతున్నాయని అన్నారు. విపరీతమైన బంకా, తేనె మంచు పురుగు, దారాల పురుగులను అరికట్టేందుకు రైతులు హార్టికల్చర్ అధికారుల సూచనల మేరకు ఇప్పటికే మూడు నుంచి నాలుగు సార్లు మందులు పిచికారీ చేసినట్లు తెలిపారు. అయినా ఎలాంటి ప్రతి ఫలితం కనపడలేదని అన్నారు. అరకొర కాపు వచ్చినా గిట్టుబాటు ధర వస్తుందో, రాదోనన్న ఆశ, నిరాశలలో ఎదురు చూస్తున్నామని రైతులు చెబుతున్నారు. వ్యవసాయ అధికారులు పరిశీలించి ఈ ఏడాది పంటల బీమా వర్తించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మామిడి రైతులను ఆదుకోవాలి

ప్రకృతి వైపరీత్యాలతో మామిడి రైతులు నష్టపోతూనే ఉన్నారు. ఆరుగాలం కష్టపడి అప్పులు చేసి సాగుచేసుకున్న మామిడి ఈ యేడాది కూడా మరింత అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేసింది. ఎంతో వ్యయ ప్రయాసాలతో మామిడిని సాగు చేస్తే పూత, పిందె దశలోనే కాయలు రాలిపోతుండటంతో రైతులు దిగాలు చెందుతున్నారు. వీరబల్లి బేనీషాకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. అయినా పంట చేతికి రాకపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ప్రభుత్వం మామిడి రైతులు పంటల బీమా వర్తింజేసి ఆదుకోవాలి.

-సురేందర్‌రెడ్డి, విఆర్‌డిఎస్

సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేయాలి

గుట్టకిందరాసిపల్లె నుంచి బయనేనివారిపల్లెకు వెళుతున్న మట్టిరోడ్డు

ప్రజాశక్తి-సుండుపల్లె

మండలంలోని మడిపాడు గ్రామపంచాయతీలో గుట్టకింద రాసిపల్లెలో నుంచి బయనేనివారిపల్లెకు మధ్యలో ఉన్న మట్టిరోడ్డు స్థానంలో సిమెంట్‌రోడ్డు ఏర్పాటు చేసి ప్రమాదాల నుంచి కాపాడాలని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి కెవి.రమణయ్య, గ్రామ ప్రజలు పేర్కొ న్నారు. తమ దళితవాడలో గత ఇరవై ఏళ్లుగా మట్టిరోడ్డులోనే రాకపోకలు సాగిస్తున్నామని తెలిపారు. ఈ రోడ్డుకు అనుసంధానంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి వాహనాలు, పాదచారులు రాకపోకలు సాగిస్తున్నారని పేర్కొన్నారు. వర్షం వచ్చిందంటే ఈ రోడ్డు మార్గాన వెళ్ళాలంటే నరక ప్రాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ద్విచక్ర వాహనదారులు తరచూగా ప్రవ మాదాలకు గురై తీవ్రంగా గాయపడిన సంఘటనలు చాలా జరిగాయని అన్నారు. ఈ రోడ్డు వెళ్ళాలంటే భయంగా ఉందని వాహనదారులు ఆందోళ చెందుతున్నారు. సిమెంట్ రోడ్డు నిర్మాణం కోసం అనేకమార్లు ప్రజాప్రతిధులతో పాటు, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాధుడే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కట్టకింద రాసిపల్లె నుంచి బైనేనువారిపల్లి మంజూరు చేయాలని కోరారు.

'ఉపాధి'పనులను తనిఖీ చేసిన పీడీ

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రమైన గాలివీడు, నూలివీడు, గోరాన్ చెరువు గ్రామాలలో జరుగుతున్న ఉపాధి పనులను పీడీ వెంకటరత్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫారం పాండ్స్ పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు. కూలీలు వెళ్లిన సమయానికి ఉదయం 8 గంటలకే గాలివీడు గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సీనియర్ మేట్ రాజన్నను పిలిపించి నాణ్యతగా చేయాలని లైన్ వేసి రెండు అడుగుల లోతు ఉండేలా చూడాలని పేర్కొన్నారు. రైతు పనులకు ప్రాధాన్య తేవాలని గతంలో వంద రోజులు ఉపాధి పని పూర్తయిన వారికి 50 దినాలు అదనంగా ప్రభుత్వం ప్రభుత్వం కల్పిస్తోందని చెప్పారు. కూలీలకు నీడ, నీరు వసతి కల్పించాలని ఎపిఒ రామచంద్ర, హరిప్రసాద్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో టిఎ.శివశంకర్‌బాబు, ఎఫ్‌ఎలు అక్బర్‌బాషా, ఈశ్వర్ రెడ్డి కూలీలు వెంకటసుబ్బన్న, భీమారావు, వెంకటాద్రి, రఘు, రామసుబ్బమ్మ, సరోజినీ ,యశోదమ్మ, నాగులు కూలీలు పాల్గొన్నారు.

ఫారంపాండ్స్ పనులను పరిశీలిస్తున్న పీడీ వెంకటరత్నం

మురుగునీటి సమస్యకు పరిష్కారమెప్పుడో?

రోడ్డుపై పారుతున్న మురుగునీరు

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రం గాలివీడులోని బస్టాండ్ నుంచి పెద్దూరుకు వెళ్ళే దారిలో మురుగు కాలువలోని నీరు రోడ్డుపై ప్రవహిస్తున్నాయి. పక్కిరారెడ్డిగారిపల్లి, హైస్కూల్, బస్టాండ్ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చే వారు ఈ బురద నీరు తొక్కి పోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. రంజాన్ మాసం కావడంతో ఈ దారిలో మసీదు వెళ్ళాలంటే ఇబ్బందిగా ఉందని ముస్లిములు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజూ కాలువల్లో మురుగనీటి వల్ల దుర్వాసన వెదజల్లుతోందని, వాహనాలు కూడా ప్రమాదాలకు గురవుతున్నాయని చెబుతున్నారు. రాత్రి వేళల్లో దోమలు విపరీతంగా విజృంభిస్తున్నాయని, విష జ్వరాల బారినపడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మురుగునీటితో చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్ లోని ఖాజామీయా టీ హోటల్ నుంచి నుంచి క్రింది వరకు మురుగు కాలువను పరిశీలించి చర్యలు తీసుకుంటే సమస్య తగ్గుతుం దని అంటున్నారు. గతంలో వేసిన కాలువ చిన్నది కావడం కొత్తగా వేసిన కాలువ పెద్దది కావడంతో నీరు అందులో పోకుండా బయటికి పొంగి ప్రవహించడం వల్లే మురుగునీరు రోడ్డుపై పారుతోందని చెబుతున్నారు. పారిశుధ్యంపై పంచాయతీ అధికారులు దృష్టిపెట్టి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

మూలకే పరిమితమైన డస్ట్‌బిన్‌లు

- పంపిణీ చేయడంలో అధికారుల అలసత్వం

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు తడిచెత్త,పొడి చెత్త సేకరణకు ప్రజలకు ఇవ్వాల్సిన డస్ట్‌బిన్‌లో స్థానిక ఇఒపిఆర్‌డి కార్యాలయంలో కొన్నేళ్లుగా మూలనపడ్డాయి. డస్ట్‌బిన్‌లను ప్రజలకు పంపిణీ చేయడంలో అలసత్వం అలసత్వం వహిస్తున్నారు. మండలంలో 17 గ్రామపంచాయతీలు ఉన్నాయి. గ్రామాల్లో డస్ట్‌బిన్‌లు ఉపయోగించే అవసరం లేకపోయినా గాలివీడు, గోరాన్ చెరువు, నూలివీడు, గ్రామాల ప్రజలు రోడ్డుపై ఉన్న ప్రజలకైనా డస్ట్ బిన్‌లు పంపిణీ చేయాలని కోరుతున్నారు. ఇళ్లల్లోని చెత్తా చెదారం రోడ్లపై వేస్తుడంతో రోడ్లన్నీ మురికి కూపంలా తయారవుతున్నాయని పేర్కొఆన్నరు. సంవత్సరాలు జరుగుతున్నా డస్ట్‌బిన్‌లను ప్రజలకు పంపిణీ చేయకుండా మూలనే పడేయడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సోమవారం మండలంలోని సెక్రటరీలు, కార్యదర్శులు అందరూ అక్కడ సమావేశం అవుతారని, కానీ వీటిపై దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలనే ఆలోచన ఎవ్వరికీ రాక పోవం శోచనీయమని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డస్ట్‌బిన్‌లను ప్రజలకు పంపిణీ చేసి పారిశుధ్య చర్యలను మెరుగుపరచాలని ప్రజలుకోరుతున్నాం


నిరుపయోగంగా ఉన్న డస్ట్‌బిన్లు

ప్రజా సమస్యలపై పోరాటం చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రజాసమస్యలపై పోరాడాలని వైసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలో వైసిపి నేతల మధ్య సతీష్‌రెడ్డి గరువారం తన పుట్టినరోజు వేడుకలను చేసుకున్నారు. స్థానిక సతీష్‌రెడ్డి స్వగృహంలో మాజీ ఉప సర్పంచ్ మునీర్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. సంబరాల్లో వందలాది మంది వైసిపి నేతలు, అభిమానులు పాల్గొన్నారు. కార్యకర్తలు ధైర్యంగా ముందుకు సాగాలని సతీష్‌రెడ్డి కోరారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని మనందరం సమిష్టిగా కృషి చేస్తేనే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకునే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకపోవడంతో ప్రజలు విసిగిపోయి ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ చంద్రఓబుల్ రెడ్డి, సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, మాజీ ఉప సర్పంచ్ మునీర్, ఆర్ఎంఎస్ మున్నా, మండల ఉపాధ్యక్షులు మునీర్ బాషా, వైసిపి నాయకులు రామచంద్రారెడ్డి, హేమాద్రి రెడ్డి, బంక సోమేశ్వర్ రెడ్డి, రామగంగిరెడ్డి, మాజీ ఎంపిపి గోగుల కొండయ్య, బిఎస్ షేక్షావలి, పద్మా రాజ్‌కుమార్, ఘతాల శ్రీను, ప్రసాద్, మాజీ దేవస్థానం చైర్మన్ కుర్రాకుల వెంకటేష్, భారతి, చంద్రశేఖర్, హబీబ్, అభిమానులు పాల్గొన్నారు.

మంచినీటిని తాగుతున్న విద్యార్థులు

నీటి శుద్ధి యంత్రానికి మరమ్మతులు

- తీరిన విద్యార్థుల తాగునీటి కష్టాలు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని జడ్‌పి హైస్కూల్ అనంతంపల్లిలో గత ప్రభుత్వ హాయంలో అందజేసిన నీటిశుద్ధి యంత్రం గత కొద్దిరోజులుగా పనిచేయక విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బయట వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని తెచ్చుకొని దాహం తీర్చుకుంటున్నారు. . పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయలక్ష్మి ఆధ్వర్యంలో నీటి శుద్ధి యంత్రాన్ని రిపేరు చేసి గురువారం పాఠశాలలోని విద్యార్థులకు శుద్ధ నీటిని అందిచినట్లు ప్రధానోపాధ్యాయురాలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలోగాని, తాగునీటి విషయంలో గానీ, ఆట స్థలం విషయంలో గానీ, విద్యార్థులు చల్లని వాతావరణంలో చదువుకునే విషయంలోగాని ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. రాబోవు 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో విద్యార్థులందరూ బాగా చదివి వందశాతం ఉత్తీర్ణతతో పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులతో సిఐ జీవన్‌గంగానాథ్‌బాబు

మహిళల భద్రతకు ఓపెన్ హౌస్ : సిఐ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఉన్నతాధికారుల ఉత్తర్వులు మేరకు బాలికలు, మహిళలకు సంరక్షణ పోలీసు స్టేషన్‌లో ఓపెన్ హౌస్ ను ఏర్పాటు చేసినట్లు సిఐ జీవన్ గంగానాథ్‌బాబు పేర్కొన్నారు. గురువారం బి.కొత్తకోట పట్టణంలోని మహిళలు , కస్తూరిబాయి హైస్కూల్‌లో ఉన్నటువంటి బాలికలు పోలీస్ స్టేషనుకు వచ్చి ఉమెన్ సేఫ్టీ, వారికి అత్యవసర పరిస్థితుల్లో టోల్ ఫ్రీ నెంబర్స్ 122,181,10920,1291పై క్లుప్తంగా వివరించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన షీ టీమ్స్, వారి భద్రత కొరకు రూపొందించిన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విపత్కర పరిస్థితిల్లో మహిళలు, బాలికలు టోల్ ఫ్రీ నెంబర్లను సంప్రదిస్తే సకాలంలో వారికి రక్షణ కల్పిస్తామని తెలిపారు.ఎవరైనా ఆకతాయిలు మీ జోలికొస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

సంస్కృతి, సంప్రదాయాలకు వన్నె తెచ్చేది మహిళలే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : సంస్కృతి, సంప్రదాయాలకు వన్నె తెచ్చేది మహిళలేనని డిఎస్‌పి భావన పేర్కొన్నారు. స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఆవరణలో గురువారం మహిళ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. కడప జిల్లా పోలీస్ శాఖ, సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ, వికసిత ఫౌండేషన్ సంయుక్తంగా కలసి నిర్వహిస్తున్నారు. ఈ సం దర్భంగా డిఎస్‌పి మహిళలు, విద్యార్థినులు వేసిన ముగ్గులను పరిశీలించి మెచ్చు కున్నారు. కార్యక్రమంలో సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి శ్రీని వాసరెడ్డి, శూలం లక్ష్మీదేవి, కళాశాల కరస్పాండెంట్ అరకటవేముల హరి నారాయణ మాట్లాడారు. కళాశాల కో-ఆర్డినేటర్ గౌరీ శంకర్, పృథ్వీ నారాయణ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

స్కూల్ వ్యాన్, బైక్ ఢీ

- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-పుల్లంపేట

ప్రమాదంలో మృతి చెందిన బాలయ్య

మండల పరిధిలోని అనంతసముద్రం సిద్ధవాండ్లపల్లి దగ్గర గురువారం రాజంపేటకు చెందిన శ్రీ చైతన్య స్కూల్‌కు చెందిన వ్యాన్ విద్యా ర్థులను తీసుకొని వెళుతున్న సమయంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాల య్యాయి. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పి.కమ్మపల్లి దళితవాడకు చెందిన బత్తల బాలయ్య(64), మాలేపాటి రమణయ్య అనే ఇద్దరు బైక్ పై వెళుతుండగా అనంతసముద్రం, సిద్ధవాండ్లపల్లి దగ్గర స్కూల్ వ్యాన్ ఢీకొందని తెలిపారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయని తెలిపారు. గాయపడిన వారిని రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. తలకు తీవ్రమైన గాయమైన బాలయ్యను అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలిస్తున్న సమయంలో మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. మరో వ్యక్తి తీవ్ర రక్తస్రావంతో రాజంపేట ప్రభుత్వాసు పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ మోహన్‌కుమార్‌గౌడ్ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న గుర్తుతెలియని కారు

- భార్యభర్తలకు గాయాలు : కేసు నమోదు

- కారు ఆచూకీపై సమాచారం ఇవ్వాలన్న ఎస్ఐ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

నిర్లక్ష్యంగా, వేగంగా కారు నడిపి ఎదురుగా బైక్‌పై వస్తున్న పానీ పూరి వ్యాపారి శ్రీనివాసులు అతని భార్య లలిత ను ఢీకొన్న రోడ్డు ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. బుధవారం రాత్రి నిమ్మనపల్లి-మదనపల్లె మార్గంలో, రెడ్డివారిపల్లి పంచాయతీ పిట్టావాండ్లపల్లె వద్ద, సోమల మండలం తమ్మినాయనపల్లి పంచాయతీ కురువపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులు, మదనపల్లి పట్టణంలోని ఈశ్వరమ్మ కాలనీ పెట్రోల్ బంక్ వద్ద పానీపూరి వ్యాపారం చేస్తూ జీవిస్తున్నాడు. వ్యవసాయ పనుల నిమిత్తం భార్య లలితతో కలిసి స్వగ్రామానికి వెళ్లి తిరిగి సాయంత్రం ద్విచక్ర వాహనంలో మదనపల్లెకు వస్తున్నారు. అదే సమయంలో మదనపల్లి వైపు నుంచి వచ్చిన గుర్తు తెలియని కారును డ్రైవర్ అతివేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ శ్రీనివాసులు ద్విచక్ర వాహనాన్ని ఢీకొని అక్కడి నుంచి వెళ్లిపోయారు. తీవ్రంగా గాయపడిన బాధితులను భార్య లలిత, బంధువు రమేష్ సాయంతో మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. రమేష్ ఫిర్యాదు మేరకు ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ప్రమాదానికి కారణమై గుర్తు తెలియని కారు, డ్రైవర్ ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. ప్రమాద స్థలంలో స్విఫ్ట్ డిజైర్ కారుకు సంబంధించిన బంపర్ విడి భాగం లభించిందని అన్నారు. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు మేరకు తెల్ల రంగు కారుగా గుర్తించినట్లు తెలిపారు. విడిభాగం ఆధారంగా కారు ఆచూ కీ తెలిసినవారు పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.